సాక్షి తిరుపతి

శనివారం । 23 । నవంబర్ । 2024



కూలిన ఆశలు
గోడ కూలి ఒకరు మృతిచెందగా.. అరుగురు ఆస్పత్రి పాలైన ఘటన చంద్రగిరిలో విషాదాన్ని మిగిల్చింది. - 8లో



చదువులమ్మ ఒడిలో గం'జాయ్'
జాతీయ సంస్కృత వర్సిటీలో శుక్రవారం గంజాయి ప్యాకెట్ల విక్రయం కలకలం రేపింది. - 8లో



ఇళ్లు ఖాళీ చేయండి
రైల్వే లైను విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు ఖాళీ చేయాలని రేణిగుంట మండలం, ఏఎస్ఆర్ కాలనీ వాసులను ఆర్డీఓ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆగమోక్తంగా లక్ష బిల్వార్చన, కుంకుమార్చన



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించారు. మొదట స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, రుత్వికులు ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఈ పూజలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయ.

26లోపు పది పరీక్ష ఫీజు చెల్లించండి

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును ఈ నెల 26వ తేదీలోపు చెల్లించాలని డీఈఓ కేవీఎస్.కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు పరీక్ష ఫీజును 10,708 మంది చెల్లించారని, ఇంకా 14,916 మంది చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఫీజు చెల్లించని ఆయా యాజమాన్య పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు తక్షణమే పరీక్ష ఫీజును చెల్లించేలా చొరవ తీసుకోవాలన్నారు.

ఓటు నమోదు అవకాశం

తిరుపతి అర్బన్: అర్హులైన వారు ఓటును నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. ఆ మేరకు శని, ఆదివారాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఫారం 6 తొలగింపులు, ఫారం 7 సవరణకు సంబంధించి ఫారం 8ను స్వీకరిస్తారని వివరించారు. 18 ఏళ్ల నిండిన వారు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.

'మేం అధికారంలోకి వస్తే నేతన్నలకు అండగా నిలుస్తాం. చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. ఆరోగ్య బీమాను పెంచుతాం. సబ్సిడీ నూలు, మార్కెట్ అవకాశాలు పుష్కలంగా కల్పిస్తాం. వస్త్ర కొనుగోలుపై 20 శాతం రిబైట్ ఉండేలా చర్యలు చేపడుతాం...' అంటూ గత ఎన్నికల ప్రచారంలో విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా చంద్రబాబునాయుడు హామీలు గుప్పించారు. కల్లబొల్లిమాటలతో నేతన్నలను బోల్తా కొట్టించి ఓట్లు దండుకున్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా వారి హామీల అమలుకు కనీసం బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేయకుండా నరకం చూపిస్తున్నారు. నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక.. చేనేత వస్త్రాలకు మార్కెట్లో డిమాండ్ లేక పలువురు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మరికొందరు మగ్గాలు వదిలి వలసబాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.



ఆకలి పేగులు.. అతకని పోగులు!

రాష్ట్ర బడ్జెట్‌లో నేతన్నలకు రిక్తహస్తం

- హామీలు విస్మరించిన కూటమి నేతలు
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఊసే లేదు
- ఆరోగ్య బీమా మాటెత్త లేదు
- మగ్గాలు వదిలి వలస బాటే శరణ్యమంటున్న చేనేతలు

వెంకటగిరి(సైదాపురం): చేనేతల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ కూటమి నేతలు చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. గత సోమవారం నుంచి జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో వారికిచ్చిన హామీల మేరకు కనీసం నామమాత్రంగానైనా కేటాయింపులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర బడ్జెట్ రూ.2,94,427.25 కోట్లు కాగా అందులో చేనేతలకు 0.066 శాతం కేటాయించడంపై నేతన్నలు మండిపడుతున్నారు. కేంద్ర బడ్జెట్ లోనూ చేనేత రంగానికి కేటాయింపులు తగ్గించడంపై పలువురు రగిలిపోతున్నారు.

మూగబోతున్న మగ్గాలు

తిరుపతి జిల్లా వెంకటగిరి, పుత్తూరు, నారాయణవనం తదితర ప్రాంతాల్లో పలువురు చేనేత మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చేనేతను పూర్తిగా విస్మరించడంతో పలువురు నేతన్నలు మగ్గాలు వదిలి ఇతర కూలిపనుల్లో నిమగ్నమవుతున్నారు. మరికొందరు కుటుంబాలతో సహా ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంకటగిరిలో 5 వేల మగ్గాలు పైచిలుకు ఉండగా ప్రస్తుతం 2వేలకు తగ్గిపోయాయి. కొందరు కులవృత్తిని వదులుకోలేక ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా వస్త్రాలు, డ్రస్ మెటీరియల్ తయారు చేస్తున్నా వాటికి మార్కెట్లో డిమాండ్ లేక కుమిలిపోతున్నారు.



రాట్నం చుడుతున్న చేనేత కార్మికురాలు

గత ప్రభుత్వంలో నేతన్ననేస్తం లబ్ధి పొందిన వివరాలు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నిధులు రూ.లక్షలు
2019-20	3,822	9.17
2020-21	3,572	8.81
2021-22	3,125	7.50
2022-23	3,171	7.51
2023-24	3,447	8.28

ప్రత్యేక బడ్జెట్ విడుదల చేయాలి



చేనేతలను అన్నీ విధాలుగా ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేయాలి. నేత కార్మికుల కుటుంబాలకు ఉచిత విద్యుత్‌తోపాటు ప్రత్యేక యూనిట్స్‌ను మంజూరు చేసి అండగా నిలవాలి.

–అప్పిన కాంతారావు, చేనేత కార్మికుడు, వెంకటగిరి

జీఎస్టీని మినహాయించాలి



చేనేత కార్మికులు చీర తయారీకి సంబంధించిన ముడిసరుకులు కొనుగోలు, క్రయవిక్రయాలపై గతంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీఎస్టీని మినహాయించాలి. చేనేత వ్యాపారాలు మరింత ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలి.

– కూనా మల్లికార్జున్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, వెంకటగిరి

గతంలో అండగా నేతన్న నేస్తం

మోడు బారిన మగ్గం బతుకులకు గత రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగులు అద్దింది. నేత పనులు సాఫీగా సాగే విధంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి పురుడుపోశారు. ఈ పథకం కింద అర్హత కలిగిన చేనేత కుటుంబానికి నెలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి రూ.24 వేలు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తూ వచ్చారు. ఐదు విడతల్లో ఒక్కో నేత కార్మికుడికి రూ.1.2 లక్షలు అందించారు. వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు క్లస్టర్లు ఏర్పాటు చేసి వెరైటీ డిజైన్లు, 240 హుక్స్ మోట రైజ్డ్‌లిఫ్టింగ్ డైస్, ఐరన్ ఫ్రేమ్‌లూమ్స్‌లాంటి మిషన్లు, మోటార్లు తదితర పరికరాలను 80 శాతం సబ్సిడీతో అందించారు. వెంకటగిరిలోని భావానారుషి చేనేత క్లస్టర్‌లో 895 మంది చేనేత లబ్ధిదారులకు రూ.1.63 కొట్ల రుణాలు మంజూరు చేశారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం కార్మికులకు సరైన ప్రోత్సాహం, ఉపాధి ఇవ్వకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితి దాపురించింది.



చేనేత మగ్గంపై నేత కార్మికుడు

చేనేతలపై దృష్టి సారించాలి



చేనేతలను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేయాలి. అధునాతన పద్ధతిలో మగ్గాల పనులు సాఫీగా సాగేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. గత ప్రభుత్వాలాగా ప్రత్యేక రుణాలు కేటాయించాలి.

–కె.శ్రీనివాసులు, చేనేత కార్మికుడు, వెంకటగిరి

గతంలో అండగా నిలిచిన నేతన్న నేస్తం



గత జగన్ ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకం కార్మికులకు అండగా నిలిచింది. కార్మికుల దుర్భర జీవితాల్లో వెలుగులు నింపింది. నేతన్ననేస్తం నిధులతో మగ్గాలకు సరికొత్త హంగులద్ది ఆధుక వైపు అడుగులు వేశారు.

– బాలాజీ, చేనేతకార్మికులు, వెంకటగిరి

హామీలు అమలు చేయమంటే అక్రమ కేసులా?

- మాజీ సీఎం జగన్‌పై అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిని కట్టడి చేయండి

పెళ్లకూరు: కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయమని అడిగే వాళ్లపై అక్రమంగా కేసులు పెట్టడం అన్యాయమని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నేతలు

చెత్త తొలగింపునకు చర్యలు

తిరుమల: తిరుమలలో 30 ఏళ్లగా పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు టీటీడీ ఈఓ జే.శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆయన అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముందుగా గోగర్భం జలాశయం సమీపంలోని కాకులమాను దిబ్బ వద్ద ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. అనంతరం ఈఓ మీడియాతో మాట్లాడుతూ పేరుకుపోయిన చెత్త వల్ల దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టామని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. మూడు, నాలుగు నెలల్లో చెత్తను మొత్తం తొలగిస్తామన్నారు. తడి చెత్త కూడా వేల టన్నులు ఉందని, ఐఓసీఎల్ బయో గ్యాస్ ప్లాంటు అందుబాటులోకి వస్తే తడి చెత్త తగ్గుతుందన్నారు. ఇప్పటికే తడి చెత్త ద్వారా 20వేల టన్నుల కంపోస్టు తయారు చేశామన్నారు. అనంతరం పాపవినాశనం చేరుకున్న ఈవో మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పార్కును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాపవినాశనం టోల్ గేట్ వద్ద జారీచేసే టోల్ రశీదులను తనిఖీ చేశారు. ఆకాశ గంగ మెట్ల మార్గంలో ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈ సుధాకర్, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ సీఎఫ్ శ్రీనివాస్, డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి, వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.



డంపింగ్ యార్డ్ ను పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వండి

కోట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్ఐఓ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడామైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల జోనల్ క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. డీవైఈఓ మధుబాబు, నెల్లూరు డీసీఓ జయలక్ష్మి, ఎంఈఓ మస్తానయ్య, ప్రిన్సిపల్ ఏ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

బిజీగా ఉన్నాం.. అంటే కుదరదు!

- రైతులతో గౌరవంగా నడుచుకోండి
- శిక్షణ కార్యక్రమంలో డీఏఓ

తిరుపతి అర్బన్: 'మేము ఈ రోజు బిజీగా ఉన్నాం .. తర్వాత రండి' అంటే కుదరదని డీఏఓ ఎస్.ప్రసాద్‌రావు సిబ్బందిని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్ర వారం వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులకు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. డీఏఓ మాట్లాడుతూ కేవలం అన్నదాతల కోసమే గత సర్కార్ ఆర్బీకేలను ఏర్పాటు చేసిన సంగతిని గుర్తుచేశారు. ప్రతి ఉద్యోగి రైతులతో గౌరవంగా నడుచుకోవాలన్నారు. కొందరు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్టు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న అగ్రికల్చర్ అధికారులు హరిత, సరళ, గాయత్రి పంట ఈ క్రాప్, పంటల బీమా, పీఎం కిసాన్ నమోదుకు సంబంధించిన పలు సూచనలు చేశారు. సూక్ష్మ నీటి సేద్య జిల్లా అధికారి సతీష్ మాట్లాడుతూ రైతులను బిందు సేద్యం వైపు మళ్లించే దిశగా పని చేయాలన్నారు. ప్రాంతీయ వ్యవ సాయ పరిశోధన అధికారి మురళీకృష్ణ రసాయనిక ఎరువుల వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ భాస్కరయ్య, ఏడీఏ లక్ష్మీదేవి, ఏవోలు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏఓ ఎస్.ప్రసాద్‌రావు

బడిగంటపై ఆందోళన!

తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండలం, రాజానగరం జెడ్పీ హైస్కూల్‌లో 210 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు చుట్టుపక్కల ఉన్న 15 నుంచి 20 గ్రామాల విద్యార్థులు 6 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. ఈ హైస్కూల్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామాపురం గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేదు. కూటమి ప్రభుత్వం పాఠశాలల సమయం పెంచితే ఆ విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు తప్పవని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా తిరుపతి జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల పనివేళలు పెంచనున్నారు. దీనిపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వింత పోకడలకు తెరలేపుతోంది. హైస్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయం పెంచేందుకు నిర్ణయం తీసుకుని పైలెట్ ప్రాజెక్టుగా పలు పాఠశాలల్లో అమలు చేసేందుకు సిద్ధమైంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల గైర్హాజరు

తిరుపతి జిల్లాలో 2,354 ప్రభుత్వ పాఠశాలలుండగా.. ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,87,444 మంది చదువుతున్నారు. ఇందులో 1,66,276 మంది విద్యార్థులు పాఠశాలలకు రెగ్యులర్‌గా విచ్చేస్తుండగా.. మిగిలిన 21,168 మంది అనేక కారణాలతో పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు. ప్రభుత్వం గంట సమయం పెంచితే మరింత మంది విద్యార్థులు పాఠశాలలకు దూరమయ్యే అవకాశం ఉన్నట్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అయ్యోర్లపై రెట్టింపు భారమే

ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకోవాలంటే దూరాన్ని బట్టి ఇంటివద్ద 7 లేదా 8 గంటలకే బయలుదేరాలి. సాయంత్రం 5 వరకు బడిలోనే ఉంటే ఇంటికి చేరుకొనేసరికి రాత్రి 7 అవుతుంది. అంటే అయ్యోర్లు ప్రభుత్వ విధుల కోసమే రోజులో 10 నుంచి 12 గంటలు కేటాయించాల్సి వస్తుంది. మహిళా ఉపాధ్యాయులకు ఇది కష్టకాలమే. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల ఊసెత్తలేదు. జూలైలో మాత్రమే ఒకటో తేదీన వేతనాలు అందాయి. మధ్యంతర భృతి ప్రకటిస్తుందని ఆశించినా.. ప్రస్తుత బడ్జెట్లో ఆ ఊసేలేదని పలువురు మండిపడుతున్నారు.



శ్రీకాళహస్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న టీచర్లు (ఫైల్)

తిరుపతి జిల్లా సమాచారం

ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూల్స్	251
కేజీబీవీ, ఏపీ మోడల్, రెసిడెన్షియల్	140
ప్రైవేట్ ఎయిడెడ్ హైస్కూల్స్	30
విద్యార్థుల సంఖ్య	59,871
హైస్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్లు	5,152

నిర్ణయం మార్చుకోవాల్సిందే

అనాలోచిత నిర్ణయాన్ని మార్చుకోవాల్సిందేనని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. తిరుపతి జిల్లాకు సమీపంలో ఉన్న తమిళనాడులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.10 వరకు, కర్ణాటక లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పాఠశాలల పనివేళలు ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. తెలంగాణలో సైతం ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

సమయం పెంపు లాభమా? నష్టమా?

పాఠశాలల పనివేళలను సాయంత్రం పూట మరో గంట పెంచడం వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు లాభం కంటే నష్టమే ఎక్కువగా కనిపిస్తోంది. పిల్లలను 8 గంటల పాటు పాఠశాలలో కూర్చోబెట్టడం తగదని మేధావులు అభిప్రాయ పడుతున్నారు. గ్రామాలకు సరైన రవాణా సౌకర్యాలు లేవు. దీంతో పిల్లలు 5 గంటల వరకు పాఠశాలలోనే గడిపితే ఇంటికి వెళ్లడానికి ఆలస్యమవుతుందని అంటున్నారు. ఒక్కో పీరియడ్ 45 నిమిషాల వంతున 8 పీరియడ్లను పెట్టడం వల్ల విద్యార్థులు మరింత అలసిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రార్థన సమయాన్ని 15 నుంచి 25 నిమిషాలకు పెంచడం కూడా అభ్యంతరకరమేనని.. చెబుతున్నారు.

ఆ నిర్ణయం సరికాదు



ఇప్పటికే రకరకాల యాప్‌లు, శిక్షణలు, వివిధ బోధనేతర పనులతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు మరలా తలకు మించిన భారంగా పాఠశాలల సమయం పెంచడం సరికాదు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచడం వల్ల ఇబ్బందికరంగా మారుతుంది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలి.

– బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు, తిరుపతి జిల్లా

అసంబద్ధ విధానం



ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలకు స్వస్తి పకలాలి. పాఠశాలల్లో పని వేళలను పెంచడం శాస్త్రీయ విధానానికి, మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకం. అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న కేరళలో ఉదయం 9.10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదు.

– ముత్యాలరెడ్డి, తిరుపతి జిల్లా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

తమిళనాడులో సాయంత్రం 4.10 వరకే



జిల్లాకు సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో ఉదయం 9.నుంచి సాయంత్రం 4.10 వరకు పాఠశాలలు నిర్వహిస్తారు. ఉత్తరాది రాష్ట్రాల్లో అతి పెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో 9.30 నుంచి 3.30 వరకు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో కూడా ఇటువంటి విపరీత ధోరణులు లేవు. ఆంధ్రప్రదేశ్‌లో పని వేళలు పెంచడానికి పైలట్ ప్రాజెక్టు చేపట్టడం ఏంటి?.

– విజయ్, ఆపస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.79,950
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,242

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.93,200
రిటైల్ వెండి గ్రాము	రూ.96.20

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

రేణిగుంట: విజయవాడ పటమట జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఈనెల 24, 25 తేదీలలో జరగనున్న అండర్–14 రాష్ట్ర స్థాయి సపక్‌తక్రా పోటీలకు రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం రఘుప్రసాద్ తెలిపారు. జిల్లా జట్టు తరఫున తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఏ.దయాకర్, ఏ.వెంకటేష్, జీ.మునిచంద్ర ఎంపికై నట్టు వెల్లడించారు. ఆయన వెంట పీడీ ఎస్.జేమ్స్ ఉన్నారు.

రీసెర్చ్ అసోసియేట్, రీసెర్చ్ ఫెలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీలో రీసెర్చ్ అసోసియేట్, సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఎం–ఉషా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ సి.వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం–ఉషా, ఎంఈఆర్‌యూ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వ మంజూరు చేసిన ప్రాజెక్టుల కోసం పనిచేసేందుకు నియామకాలకు పూనుకున్నట్టు తెలియజేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వచ్చేనెల 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్ 17న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులతో పాటు మరిన్ని వివరాలకు పద్మావతి మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

మృతి చెందిన ఒడిశా కార్మికుడు కళాకర్ రాణా





ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అనిత

కూలిన ఆశలు!

గోడ కూలి ఒకరి మృతి

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం!
- కనీస జాగ్రత్తలను పాటించని వైనం
- పట్టించుకోని కార్మిక శాఖ

చంద్రగిరి: ఆశలు కూలిపోయాయి. పొట్టచేతబట్టుకుని వచ్చిన ఒడిశా కార్మికుల బతుకులు ఛిద్రమయ్యాయి. కూలిపనులు చేసి పైసాపైసా కూడబెట్టి ఇంటికి పంపాలనుకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రమాదవశాత్తు గోడ కూలి ఓ కార్మికుడు మృతిచెందగా.. మరో ఆరుగురు ఆస్పత్రి పాలయ్యారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ ఘటన శుక్రవారం చంద్రగిరి పట్టణంలో విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల మేరకు.. చంద్రగిరి పాతపేటకు చెందిన సుధా మెడికల్స్ యజమాని సుధాకర్‌రెడ్డి, కొత్తపేటలోని తన స్థలంలో భవన నిర్మాణ పనులను ప్రారంభించాడు. ఈ క్రమంలో స్థలానికి అనుకుని ఉన్న వెంకటేష్ ఇంటి పక్కనే పునాదుల కోసం గురువారం గోతులు తీశారు. సుమారు 20 అడుగుల మేర గోతులు తీయడంతో వెంకటేష్ ఇంటి ప్రహరీ గోడ కూలిపోయింది. దీంతో వారికి నచ్చజెప్పి ఆ ప్రాంతంలో గోడ నిర్మాణం పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం ఒడిశా కార్మికులతో గోడకు అటువైపు మట్టిని పోసేందుకు కాంట్రాక్టర్ పూరమాయించారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గోడ కూలి ఒక్కసారిగా కార్మికులపై పడింది. ప్రమాదంలో రాజు, రమేష్, చాన్‌బాబు, స్వాతి స్‌నాయక్, సత్యనారాయణశర్మ, కళాకర్ రాణాకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. తీవ్రంగా గాయపడిన కళాకర్ రాణా(33) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్వాతిస్‌నాయక్, సత్యనారాయణశర్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎస్ఐ అనిత ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. కనీస జాగ్రత్తలు పాటించకుండా పనుల నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుట్టుచప్పుడు కాకుండా కూలీల తరలింపు

గాయపడిన కూలీలను తొలుత ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించేందుకు కాంట్రాక్టర్ యత్నించాడు. అయితే ఆ ప్రాంతమంతా కూలీల ఆర్తనాదాలతో దద్దరిల్లడంతో 108 వాహనంలో రుయాకు తరలించారు. ఆపై ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేదని మభ్యపెట్టే ప్రయత్నం చేశాడని స్థానికులు తెలిపారు.



కూలిన నిర్మాణ గోడను కుప్పగా పోసిన కాంట్రాక్టర్

లేబర్ చట్టానికి తూట్లు

స్థానికంగా ఉండే భవన నిర్మాణ కార్మికులకు అధికంగా రోజూవారి కూలీ ఇవ్వాల్సి వస్తుందని, అనధికారికంగా ఒడిశా కూలీలను కాంట్రాక్టర్లు పిలిపించుకుంటున్నారని తెలిసింది. లేబర్ చట్టంలోని నిబంధనలను తుంగలోకి తొక్కి ఇష్టానుసారంగా కనీస జాగ్రత్తలు పాటించకుండా కూలి పనులు చేయిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం జరిగిన ప్రమాదం పూర్తిగా కాంట్రాక్టర్ వైఫల్యంతోనే జరిగినట్టు స్పష్టమవుతోంది. నాసిరకంగా గోడ నిర్మాణం చేపట్టడం, నిర్మాణ సమయంలో కూలీలకు అవసరమైన సేఫ్టీ మెథడ్‌ను పాటించకపోవడం ప్రమాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

22 కిలోల గంజాయి స్వాధీనం

– ఇద్దరి అరెస్ట్

తిరుపతి క్రైమ్: ఒడిశా నుంచి తిరుపతి మీదుగా చెన్నైకి తరలిస్తున్న 22 కిలోల గంజాయిని సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేసినట్టు తిరుపతి డీఎస్పీ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా పాత తిరుచానూరులోని ఓ హోటల్ వద్ద తిరుగుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. వారు చిత్తూరు జిల్లాలోని కుప్పం, నగరి ప్రాంతాలకు చెందిన సాతుపాటి లోకేశ్వరరావు, కుమారిగా గుర్తించామన్నారు. వారిద్దరూ కలిసి గంజాయి అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఒడిశా నుంచి గంజాయిని పెద్ద మొత్తంలో తీసుకొచ్చి తిరుపతి పరిసరాలతో పాటు చెన్నైలో చిన్న చిన్న పొట్లాలు చేసి యువతకు అమ్మేవారని తెలిపారు. వీరి వద్ద నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గంజాయి విక్రయిస్తూ వీరు ఇరువురూ ఈస్ట్ పోలీస్ స్టేషన్లో పట్టుబడ్డారన్నారు. అప్పుడు చిత్తూరు జైలు రిమాండ్ ఖైదీలుగా ఉండి బయటకు వచ్చిన అనంతరం తిరిగి పుత్తూరు, తమిళనాడు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. వీరిపై రైల్వే పోలీస్ స్టేషన్లో కూడా అక్రమంగా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు కేసులు ఉన్నాయని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులతో పోలీసులు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

– రూ.6 లక్షల నగదు స్వాధీనం



పట్టుబడిన నగదును చూపిస్తున్న క్రైమ్ ఏఎస్పీ నాగభూషణం

తిరుపతి క్రైమ్ : అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి రూ.6 లక్షలు రికవరీ చేసినట్టు క్రైమ్ ఏఎస్పీ నాగభూషణం తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన ఎయిర్ బైపాస్ రోడ్‌లోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఉన్న వెస్టర్న్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ కార్యాలయంలో రూ.8 లక్షలు చోరీ జరిగినట్టు యజమాని సురేష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతి పాత రేణిగుంట రోడ్డులోని సాయినిర్మల కల్యాణ మండపం వద్ద అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.6 లక్షలను గుర్తించారు. విచారణలో అతను ప్రకాశం జిల్లా సోమరాజుపల్లికి చెందిన గురువిళ్ల అప్పలనాయుడు అలియాస్ సాయి(29)గా తేలింది. అతను వెస్టర్న్ యూనియన్ మనీ ట్రాన్స్‌ఫర్ కార్యాలయంలో చోరీ చేసినట్టు అంగీకరించాడు. అతని నుంచి రూ.6 లక్షల నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఏఎస్పీ తెలిపారు. అప్పలనాయుడు చెడు అలవాట్లకు బానిసై 16 సంవత్సరాల వయసు నుంచి చోరీలకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. అతనిపై సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌తో పాటు ఒంగోలు టౌన్, తాలూకా, తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సార్ నగర్, విశాఖపట్నంలోని అరిలోవ, ముప్వలవానిపాళెం కాలనీ, గాజువాక, ద్వారకా పోలీస్ స్టేషన్లలో 18 కేసులు నమోదైనట్టు వివరించారు. ఈ కేసును ఛేదించడంలో డీఎస్పీ, సీఐలు ఎంతగానో కృషి చేశారని తెలిపారు.

పాత సామాను కోసం వచ్చి..

చిల్లకూరు: కుటుంబ సభ్యులతో కలసి ఆటో వేసుకుని పాత సామాను కొంటామంటూ గ్రామంలో తిరుగుతూ ఎవ్వరూ లేని ఇంట్లో చోరీ చేసిన ఘటన మండలంలోని ఓడూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. ఓ కుటుంబం ఆటో వేసుకుని పాత సామాను కొంటామని గ్రామంలో తిరుగుతూ కొంతమంది దగ్గర పాత సామాను కొనుగోలు చేసింది.

ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఇంట్లో ఎవ్వరూ లేక పోవడాన్ని గమనించిన ఆ కుటుంబం ఆ ఇంటి ఆవరణలో ఉంచిన రాగి వస్తువులు చోరీ చేసి ఆటోలో వేసుకుని వచ్చే ప్రయత్నం చేశారు. అదే సమయంలో తోటకు వెళ్లి ఇంటికి వస్తున్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు గుర్తించి వారి ఆటోను అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆటో చిల్లకూరు వైపు వేగంగా వచ్చేసింది. దీంతో వారు ఆటోను వెంబడించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు చిల్లకూరు గురుకుల పాఠశాల వద్ద ఆటోతో పాటుగా చోరీ చేసిన వస్తువులను స్వాధీనం చేసుకన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఆటోను అడ్డుకుని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 60,802 మంది స్వామిని దర్శించుకోగా 21,930 మంది తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.21 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

ఎస్వీయూలో కాపర్ వైర్ల చోరీ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎడ్యుకేషన్ విభాగం వెనుక భాగంలో ఏసీకి చెందిన కాపర్ వైర్లను దొంగలు కట్ చేసి ఎత్తుకెళ్లారు. సెక్యూరిటీ సిబ్బంది దొంగలను పట్టుకునే ప్రయత్నంలో తప్పించుకుపోయినట్లు సమాచారం. వర్సిటీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగలను గుర్తించే పనిలో పడ్డారు. గతంలో ఇంటిదొంగ (వర్సిటీ ఉద్యోగి) సుమారు రూ.50వేల విలువచేసే వర్సిటీ ఫర్నిచర్‌ను దొంగలించి సెక్యూరిటీ సిబ్బందికి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. విషయాన్ని గుట్టు చప్పుడు కాకుండా స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఆ ఉద్యోగిపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా అడ్డుకున్నట్లు సమాచారం.

హెవీ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోండి

తిరుపతి అర్బన్: ఐదేళ్లకు ఒకసారి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ను రెన్యూవల్ చేసుకోవాలని, ఆర్టీసీ అందిస్తున్న రెన్యూవల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అలిపిరి డీఎం హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అలిపిరి డిపోలో కొత్తగా ప్రతి బుధవారం(ఒక్కరోజు మాత్రమే)హెవీ లైసెన్స్ రెన్యూవల్‌కు శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. శిక్షణకు రూ.1,180 చెల్లించాలని తెలిపారు. ఆర్టీసీ అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 29 బ్యాచ్‌లకు హైవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శిక్షణ పూర్తి చేసినట్టు వెల్లడించారు. ఈ నెల 27 నుంచి 30వ బ్యాచ్‌కి శిక్షణ ప్రారంభిస్తామన్నారు.

కొదమసింహాలై గర్జించాలి



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షులు కరుణాకర రెడ్డి

- వచ్చే ఫిబ్రవరి నుంచి జగనన్న జనంతోనే ఉంటారు : భూమన

పలమనేరు/ గంగవరం: ఎన్నికలెప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కొదమసింహాలై గర్జించి, మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, జగనన్నను సీఎం చేసుకుందామని ఆ పార్టీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పలమనేరు సమీపంలోని సాయినగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో స్థానిక పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అధ్యక్షతన కార్యకర్తల నియోజకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను మీలో ఒక్కనిగా జగనన్న నియమించిన సైనికునిలా పార్టీ బలోపేతం కోసం మీ సూచనలు, సలహాలతో పార్టీని ముందుకు తీసుకెళతానని చెప్పారు. గతంలో మనం చేసిన పొరబాట్లను సరిదిద్దుకుని వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. మాట తప్పిన కూటమి ప్రభుత్వాన్ని కడిగేసేందుకు, ప్రజల పక్షాన జగనన్న వచ్చే ఫిబ్రవరి నుంచి జనంలోకి రానున్నారని తెలిపారు. 40 శాతం ఓట్లు వచ్చి, ఓటమి పాలైన పార్టీ ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. కేవలం కేంద్రంతో లాలూచీ పడి జగన్‌మోహన్‌రెడ్డిని ఓ భూతంలా చూపి, కొన్ని శక్తులంతా ఏకమై ఈవీఎంలను మార్చి, అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, తిప్పేస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజకీయాలతో 'సాగు'!

- డిసెంబర్ 5, 14 సాగునీటి సంఘాల ఎన్నికలు

తిరుపతి అర్బన్: సాగునీటి రాజకీయాలకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పదేళ్ల తర్వాత మళ్లీ ఆయకట్టు ఎన్నికలకు తెరలేపింది. అధికార దర్పంతో అన్ని సంఘాలను కైవసం చేసుకోవడానికి పన్నాగాలు పన్నుతోంది. ఎన్నికల అనంతరం ఇరిగేషన్ పనులను టీడీపీ కూటమి నేతలకు కట్టబెట్టేందుకు సన్నద్ధమవుతోంది.

డిసెంబర్‌లో ఎన్నికలు

జిల్లా ఆయకట్టు ఎన్నికలను వచ్చే నెల 5, 14 తేదీల్లో నిర్వహించనున్నారు. 5వ తేదీ నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు మైనర్ ఇరిగేషన్‌కు చెందిన 599 చెరువులకు ఎన్నికలు చేపట్టనున్నారు. 14వ తేదీన మీడియం ప్రాజెక్టులైన స్వర్ణముఖి, అరణియార్ ఎన్నికలు నిర్వహించనున్నారు. స్వర్ణముఖికి 6 కమిటీలను, అరణియార్‌కు 5 కమిటీలను ఎంపిక చేయనున్నారు. మొత్తంగా చెరువులు, మీడియం ప్రాజెక్టులతో కలసి 610 కొత్త కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అయితే మేజర్ ప్రాజెక్టు అయిన తెలుగు గంగ ప్రాజెక్టు ఎన్నికలు మాత్రమే వాయిదా పడ్డాయి.

నోడల్ అధికారిగా మదన్‌గోపాల్

సాగునీటి ఎన్నికలకు జిల్లా ఇరిగేషన్ అధికారి మదన్‌గోపాల్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఆయన నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియ చేపట్టనున్నారు. ఎన్నికలకు 3,605 మంది సిబ్బందిని ఉపయోగించనున్నారు.

డిసెంబర్‌లో నైనా ఎన్నికలు జరిగేనా?

సాగునీటి ఎన్నికలు రెండు సార్లు వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో డిసెంబర్‌లో అయినా వాయిదాలు వేయకుండా ఎన్నికలు నిర్వహిస్తుందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇళ్లు ఖాళీ చేయండి

రేణిగుంట: పుత్తూరు–తిరుపతి రైల్వే లైను విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని తూకివాకం పంచాయతీ ఏఎస్‌ఆర్ కాలనీలో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లాలని శ్రీకాళహస్తి ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి నిర్వాశితులను ఆదేశించారు. శుక్రవారం రేణిగుంట ఏఎస్‌ఆర్(నక్కల) కాలనీ, గాంధీనగర్ కాలనీలకు ఆయన చేరుకుని నిర్వాసితులతో మాట్లాడారు. చెన్నై – తిరుపతి వయా రేణిగుంట సంత గేటు మీదుగా రైల్వే బైపాస్ లైన్ నిర్మాణ పనులను చేపట్టారు. ఇందులో భాగంగా తూకివాకం పంచాయతీ పరిధిలోని నక్కల కాలనీ గాంధీ నగర్ కాలనీలో సుమారు 100కు పైగా ఇళ్లను రెవెన్యూ అధికారులు రైల్వేకి స్వాధీనం చేయాల్సి ఉంది. రెండేళ్ల నుంచి రైల్వేకి స్థలాన్ని అప్పగించడంలో అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. గాంధీనగర్ కాలనీలో 54 మంది నిర్వాసితులు ఉండగా 24 మంది ఇళ్లు ఖాళీ చేసేందుకు అంగీకరించి తొలి విడిత నష్ట పరిహారాన్ని అందుకున్నారు. మిగిలిన వాళ్లు అంగీకరించకపోవడంతో దీనికి సంబంధించిన చెక్కులను ప్రభుత్వం కోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం రైల్వే చెన్నై బైపాస్ లైన్ పనులకు స్థల సమస్య ఆటంకం కావడంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు. స్థలాన్ని తమకు అప్పగించాలని రైల్వే అధికారులు ఒత్తిడి తీసుకురావడంతో ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది గాంధీనగర్ కాలనీలో నిర్వాసితులతో చర్చలు జరిపారు. ఆదివారం లోపు ఇళ్లు ఖాళీ చేస్తే ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే అద్దె కూడా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. గాంధీనగర్ కాలనీవాసులు మాట్లాడుతూ ఉన్నపళంగా ఇళ్లు ఖాళీ చేసి ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ ఇప్పటికిప్పుడు ఇళ్లు ఖాళీ చేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.



ఏఎస్‌ఆర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పొలం పనులు ముగించుకుని వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడికి తీవ్ర గాయాలు

వెంకటగిరి రూరల్: పొలం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తల్లీకుమారుడు ఇంటికి బయలు దేరారు. మార్గమధ్యంలో స్కార్పియో ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఏర్పేడు–పెంచలకోన జాతీయ రహదారి, వెంకటగిరి రూరల్ మండలం, కలపాడు సమీపంలోని తెలుగంగ వంతెన వద్ద శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన మునెమ్మ తన 12 ఏళ్ల కుమారుడు కౌశిక్‌తో కలసికి వెంకటగిరి రూరల్ మండలం, జింక్లాబంగ్లా గ్రామ సమీపం వద్ద ఉన్న వ్యవసాయ పొలానికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలోని తెలుగుగంగ కట్టపై వస్తుండగా.. పెంచలకోన–రాపూరు జాతీయ రహదారి మలుపు తిరుగుతున్న సమయంలో డక్కిలి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కౌశిక్ ఎడమ కాలు నుజ్జునుజ్జు అయ్యింది. తల్లి మునెమ్మకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి తీసుకెళ్లారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్తున్న మునెమ్మ



తీవ్రంగా గాయపడ్డ కౌశిక్

చదువులమ్మ ఒడిలో గం'జాయ్'!

- ఎన్‌ఎస్‌యూలో గంజాయి ప్యాకెట్ల కలకలం
- విద్యార్థులకు 16 ప్యాకెట్లను విక్రయించిన ఒడిశా విద్యార్థి
- యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: విశ్వవిద్యాలయాల్లో గంజాయి, మద్యం ఏరులై పారుతోంది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గత ఆరు నెలల నుంచి వర్సిటీలలో అసాంఘిక కార్యక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేమి.. విద్యార్థుల బానిసత్వం వెరసి సరస్వతీ నిలయాలు మత్తుకు బానిసవుతున్నాయి. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులను భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. జాతీయ సంస్కృత వర్సిటీలో శుక్రవారం గంజాయి ప్యాకెట్లు కలకలం రేపాయి. వర్సిటీలో యూజీ చదువుతున్న ఒడిశాకు చెందిన శతపథి అనే విద్యార్థి మత్తుకు బానిసై, గంజాయి ప్యాకెట్లను తోటి విద్యార్థులకు విక్రయించడంతో వర్సిటీలో జరుగుతున్న బాగోతం వెలుగులోకి వచ్చింది.



ఎన్‌ఎస్‌యూ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ

ఎంత మంది బానిసలయ్యారో?

సంస్కృత వర్సిటీ హాస్టల్స్‌లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఏటా వందల సంఖ్యలో అడ్మిషన్లు పొందుతుంటూరు. వర్సిటీలో సుమారు మూడు వేల మందికి పైగా హాస్టల్స్‌లో ఉంటున్నారు. ఇందులో సుమారు 20 మందికిపై మత్తుకు బానిసలైనట్లు విశ్వసనీయ సమాచారం. ఒడిశాకు చెందిన విద్యార్థి ద్వారా పెద్ద సంఖ్యలో గంజాయి కొనుగోలు చేశారని వర్సిటీలో మరెంత మంది మత్తుకు బానిసలయ్యారో పరీక్షలు నిర్వహిస్తే గానీ తెలియని పరిస్థితి.

ఆరు నెలల నుంచి జరుగుతోంది

జాతీయ సంస్కృత వర్సిటీలో గత ఆరు నెలలుగా డ్రగ్స్, గంజాయి రాజ్యమేలుతోంది. అధికారులుకు అన్ని విషయాలు తెలిసీ చర్యలు చేపట్ట లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్క సారిగా భారీ స్థాయిలో గంజాయి విక్రయం వెలుగులోకి రావడంతో చేతులు దులుపుకునేందుకు యాంటీ డ్రగ్స్ కమిటీ అంటూ నాటకాలు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి అధికారులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సాఆర్‌సీపీ, ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐతో పాటు పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

విచారిస్తున్నాం

వర్సిటీలో ప్రస్తుతం యూజీ పరీక్షలు జరుగుతున్నాయి. కొందరు గైర్హాజరవడం గమనించి హాస్టల్స్‌ను చీఫ్ వార్డన్ పరిశీలించారు. ఒడిశాకు చెందిన శతపథి అనే విద్యార్థి తాను ఒడిశా నుంచి తెచ్చిన 20 గంజాయి ప్యాకెట్లలో 16 ప్యాకెట్ల గంజాయిని విజయవాడకు చెందిన ఆంజనేయులు అనే విద్యార్థికి విక్రయించినట్టు తెలిసింది. మరో ముగ్గురు నాలుగు ప్యాకెట్లు సేవించినట్లు సమాచారం. విద్యార్థులను పలు విధాలుగా విచారిస్తున్నాం. పోలీసులుకు ఇంకా సమాచారం ఇవ్వలేదు. యాంటీ డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేసి విచారిస్తున్నాం. నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

– జీఎస్ఆర్ కృష్ణమూర్తి(వీసీ), రమాశ్రీ(రిజిస్ట్రార్)